


(19 వ భాగము)

నేను ఏదైనా బరువైన సాధనం దొరుకుతుందేమోనని గదంతా కలయజూశాను. ఎక్కడా ఏమీ కనుపించ లేదు. బాత్ రూమ్‌లో మాత్రం టవల్ స్టాండ్ కనుపిం చింది. దాన్ని బలవంతంగా వూడబీకాను. దాన్ని లాగ టంలో నా శరీరంలో వున్న శక్తిలో సగంపైనే ఖర్చయి పోయినట్లు తోచింది. నీరసంగా వుంది. దాన్ని తీసుకుని గదిలోకి వచ్చాను.

నేను దాన్ని చూసినప్పుడు మొత్తం సాలిడ్ ఐరన్ రాడ్ అనుకున్నాను. తీరా వూడబెరికి చూస్తే, పైపులా వుంది. పెద్ద బరువు లేదు.

"దాంతో దీన్ని బ్రద్దలు కొడతావా?" అడిగింది డెల్లా.

అవునన్నట్లు తలూపాను.

"ఈ మైకాషీటు చాలా దళసరిగా వుండి వుండాలి. లేకుంటే నీళ్ళలో వుండే వేగాన్ని తట్టుకోవడం కష్టం. దాన్ని తట్టుకోగలిగినదాన్ని నువ్వు ఈ తేలిక పైప్‌తో బ్రద్దలు కొట్టగల ననుకోవడం వెర్రితనమే!" అంది డెల్లా.

ఏమైనా నా ప్రయత్నం విరమించదలచుకోలేదు. పైపును ఒక చివర పట్టుకొని, శరీరంలో వున్న మొత్తం బలాన్ని కూడదీసి, వ్రేళ్ళల్లోనూ, మణికట్టులోనూ పెట్టి, కిటికీకున్న మైకా షీటు మీద, ధన, ధనమని మోదటం మొదలెట్టాను. అలా దాదాపు ఎడతెరిపి లేకుండా, ఆప కుండా పదినిమిషాలకాలం కొట్టాను.

పగలడం మాటటుంచి, కనీసం పెచ్చు కూడా లేవ లేదు. విసుగొచ్చింది. పైపు విసిరేసి కూర్చున్నాను.

"బరువు చాల లేదు" అన్నాను.

"మరేదన్నా దొరుకుతుందేమో వెలుపలికి వెళ్ళి చూడ మంటావా?" అంది డెల్లా.

"చూడు!" అన్నాను.

డెల్లా లేవబోతూ "నేను వెతుకుతూ కనుపిస్తే వాళ్ళు అనుమానించి అడిగితే ఏం చెప్పాలి?"

"ఏమో! నువ్వే ఆలోచించు!" అన్నాను.

డెల్లా వెలుపలకు వెళ్ళింది తలుపు తెరుచుకుని.

నేను అక్కడే కూర్చున్నాను.

నాకు బ్రతకాలన్న కోర్కె లేదు. కారణం చావు తప్పదని తెలుసు గనక. కానీ వీళ్ళ చేతుల్లో చిత్రహింసల పాలయి చావడం మాత్రం భరించగల శక్తిలేదు నాకు. అందుకే ఏదో రకంగా చావాలన్న తాపత్రయం పుట్టు కొచ్చింది నాలో.

డెల్లా వెళ్ళి పది నిముషాలయింది. కానీ రాలేదు. ఆమెను వాళ్ళు రెడ్ హేండెడ్ గా పట్టుకొన్నారేమోనన్న అనుమానం కలిగింది. సబ్ మెరైన్ కే ఆక్సిడెంట్ తెచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిస్తే, బేస్ దాకా కూడా తీసుకెళ్ళరు. ఇక్కడే కాల్చి చంపుతారు.

డెల్లా రాలేదు.

నాకు ఆత్రుత ఎక్కువయింది. ఇంతసేపు ఆమె ఏం చేస్తుండి వుంటుందాని వూహించసాగాను. వాళ్ళ కళ్ళల్లో బడకుండా ఇంకా వెతుకుతూండటానికి అవకాశం వుంటుందనిపించ లేదు. వెళ్ళి చూద్దామనుకుని లేచాను. తలుపుల దగ్గరకు వెళ్ళి తెరచేందుకు హాండిల్ పైన చెయ్యి వేశాను.

నా చెయ్యి హాండిల్ పై వుండగానే అది గిర్రున తిరిగింది. అంటే వెలుపల నుండి దాన్ని త్రిప్పారని తెలుసుకున్నాను.

ఠక్కున ప్రక్కకు తప్పుకున్నాను.

షివర్లీ లోని కడుగు బెట్టాడు.

"మిస్టర్ రాజ్!" అన్నాడు.

"యస్!" అన్నాను నేను ఆయనకు ఎదురుగా వచ్చి నిలుచుని.

"నాతో రా!" అన్నాడు.

మంచంపై వేసివున్న పైప్ అతను చూడకుండా జాగ్రత్త పడ్డాను. అతన్ని ముందు పోనిచ్చి, వెనుక నేను నడిచాను. తలుపులు దాటాక వేసే మూశాను. ఇద్దరం హాల్లోకి వచ్చాం. మాకు కొంచెం దూరంలో డెల్లా నిలుచుని వుంది. ఆమె చేతుల్లో పెద్ద తుపాకీ వుంది.

"ఆమెను చూశావా?" అడిగాడు షివర్లీ.

"చూశాను" అన్నాను.

"ఆమె చేతుల్లో ఏముందో చూశావా?"

"రైఫిల్ కనుపిస్తోంది."

"నీ సమాధానం ఏమిటి?" డిమాండ్ చేస్తున్నట్లు అడిగాడు.

"డెల్లా అదెందుకు తీశావ్?" అడిగాను కన్నుకొట్టి.

"ఎందుకు తీసిందీ ఇందాకే చెప్పాను అతనికి" అంది డెల్లా.

ఏం చెప్పి వుంటుందా అని వూహిస్తూ నిలుచున్నాను.

"నాతో చెప్పడం కాదు! అతనితో చెప్పు" అన్నాడు షివర్లీ.

"ఇంకెందుకు? నన్ను ఊబిలోకి లాగిన నిన్ను కాల్చి చంపడానికి!" అంది డెల్లా కోపం ప్రదర్శిస్తూ నా కేసి చూసి.

నన్ను నేనే నమ్మలేకపోయాను.

"నన్నా? హత్య చెయ్యడానికా?" అడిగాను మళ్ళీ రెట్టించి.

"నిన్నే! నా కిష్టం లేకున్నా ఈ గూఢచారి వ్యవహారాల్లోకి నన్ను దింపావ్. నేను ప్రేమించి పెళ్ళాడినందుకు నా దేశ రక్షణకు ప్రమాదం తెచ్చే పనులు చెయ్యమని పురమాయించావ్. తాళి కట్టిన భార్యనైనా నీ అసలు రహస్యం ఇన్నాళ్ళూ చెప్పకుండా ఏదేదో చెప్పి నన్ను మభ్యపుచ్చావ్. ఇప్పుడు వీళ్ళ చేతుల్లో చావు తెచ్చి పెట్టావ్ అబద్ధాలు చెప్పి. నువ్వంటే ప్రేమ చచ్చి చాలారోజులయింది. పగ మాత్రం మిగిలింది. పెరిగింది. అది తీర్చుకునేందుకే తుపాకి కోసం వచ్చాను" అంది డెల్లా.

ఆమె మాటలు అబద్ధాలు. ఆ విషయం నాకూ ఆమెకూ తెలుసు. మా ప్రయత్నం బైట పడకుండా వుండేందుకే ఆమె తెలివిగా ఆ అబద్ధం చెప్తూందని అర్థమయింది. కానీ అలా చెప్పడంలో నన్ను నిజంగానే వాళ్ళనుకుంటున్నట్లు ఏజంటుగా మార్చింది. అది నా ప్రాణాలను వాళ్ళు తీసేందుకు ఇచ్చిన పర్మిట్ లా తయారవుతుంది.

"మిస్టర్ రాజ్! నేను అనుమానించి అడిగితే బుకాయించావ్. ఇప్పుడేమంటావ్?" అడిగాడు షివర్లీ.

"ఇప్పుడూ అదే అంటున్నాను, ఆమె తుపాకీ దొంగిలించింది. ఆమె మనస్సులో బహుశా మిమ్మల్ని చంపాలని వుండివుండవచ్చు. పట్టుకోగానే తప్పించుకోవడానికి ప్లేటు ఫిరాయించి వుండాలి" అన్నాను వీలైనంత ఎక్కువగా అతన్ని కన్ఫ్యూజ్ చెయ్యాలన్న దృష్టితో.

"నాన్సెన్స్! ఆమె గన్ని దొంగిలించలేదు. నా రూం కొచ్చి నన్నడిగి తీసుకుంది. నీ ప్రాణాలు నా చేతుల్లో పోవటం నాకు ఇష్టంలేదు. అదీ నువ్వెవరో ఏమిటో, ఏ దేశం తరఫున పని చేస్తున్నావో తెలుసుకోకుండా చంపడానికి నాకు అధికారం కూడా లేదు. అందుకే ఆమెను ఆపాను" అన్నాడు షివర్లీ.

"దట్స్ ఓ కే! ఆమెను కాల్చి చంపెయ్యమనండి" అన్నాను.

"నో!" అని నన్ను నా గదిలోకి వెళ్ళమన్నాడు. ఆమెను ప్రక్కనున్న ఇంకో గదిలోకి పంపించాడు.

నేను లోనికి వెళ్ళగానే వెలుపల తాళం వేసినట్లు చప్పుడయింది.

'డెల్లా తెలివైనది' లోలోపలే అనుకున్నాను.

ఆమె ప్రవర్తన షివర్లీకి ఆమెపైన అంతులేని నమ్మకాన్ని కలిగించి తీరుతుంది. దాన్ని అడ్డం పెట్టుకొని మా ప్రాణాలు కాపాడుకొనే దారికోసం వెతకాలనుకుంటూనే వుందేమో అనుకున్నాను.

బెడ్ పైన పడుకుని కిటికీకేసి చూడసాగాను.

లైటు వెలుగులో రకరకాల జలచరాలు నాకు కనిపించసాగాయి.

వున్నట్టుండి అలారం బెల్ మ్రోగింది గదిలో. ఎర్ర దీపం ఆరుతూ, వెలుగుతూ కనిపించింది.

తక్కున లేచి కూర్చున్నాను.

రానున్న ప్రమాదానికి అది సంకేతం. ఏం ప్రమాదం రాబోతుందో అర్థం కాలేదు. తలుపుల వద్దకు వెళ్ళాను. తెరచేందుకు ప్రయత్నించాను. అవి రాలేదు. కాలితో ఘట్టిగా తన్నాను. వ్రేళ్లు నొప్పి పుట్టాయితప్ప తలుపులు మాత్రం తెరుచుకోలేదు.

అటూ ఇటూ పచార్లు చేశాను.

సబ్ మెరైన్ లోపలే అగ్ని ప్రమాదం సంభవించిందా? లేక తిమింగిలంలాంటి దేదైనా మొత్తం సబ్ మెరైన్ను మింగిందా? కిటికీలోంచి చూశాను. సుళ్ళు తిరుగుతూ నీళ్ళు కనుపించాయి. నా శరీరంలోని బరువు తగ్గుతూన్నట్లు ఫీలయినాను. అంటే మెరైన్ పైకి లేస్తుందనుకున్నాను. ఎందుకు వున్నట్టుండి నీళ్ళపైకి లేస్తుందో అర్థం కాలేదు.

ఇంతలో తలుపులు తెరచుకున్నాయి.

వెలుపలికొచ్చాను. డెల్లా నిలుచుని వుంది. షివర్లీ నావిగేటింగ్ వీల్ వైపు వెళ్ళటం చూశాను.

"ఏమైంది" అడిగాను డెల్లాను.

"ఎనిమీ సబ్ మెరైన్ ట్రాక్ చేశారు. చాలా దగ్గరలో వున్నట్లుగా వుందట. అది మన సబ్ మెరైన్‌ను వెతుక్కుంటూ వస్తున్నట్లుగా వుందని అనుమానిస్తున్నారు. దాన్ని అటాక్ చెయ్యడానికి సన్నద్ధులౌతున్నారు వాళ్లు" చెప్పింది డెల్లా.

"మనల్నేం చెయ్యమన్నాడు?" అడిగాను నేను.

"నిన్ను ఇక్కడ కూర్చోబెట్టి, తుపాకీ నీకేసి గురిపెట్టి కాపలా కాయమన్నాడు. ఏమాత్రం కదిలినా కాల్చి పారెయ్యమన్నాడు" అంది చేతులో వున్న రైఫిల్‌ని ఎత్తి చూపిస్తూ.

"గుడ్! దొంగకు తాళాలిచ్చాడన్న మాట" అన్నాను కూర్చుంటూ.

"అలా అని అతను అనుకోవడం లేదు!"

"మొత్తానికి బాగా నమ్మించావ్" అన్నాను.

"ఆ సమయానికి అందమైన అబద్ధం అంతకన్నా మరోటి తట్టలేదు నాకు. వెనకా ముందూ చూడకుండా చెప్పేశాను" అంది డెల్లా దగ్గరలో వున్న కుర్చీ లాక్కుని నా కెదురుగా కూర్చుంటూ.

సిగరెట్ వెలిగించాను.

పైనుంచి టక టక బూట్ల చప్పుడు చేసుకుంటూ వచ్చాడు షివర్లీ. నేనూ డెల్లా ఇద్దరం లేచి నిలుచున్నాం.

"డెల్లా! ఎనీ ట్రబుల్?" అడిగాడు షివర్లీ.

"నథింగ్!" అంది డెల్లా.

"మనం చాలా ప్రమాదకరమైన పరిస్థితుల్లో వున్నాం. ఎనిమీ సబ్ మెరైన్‌లు రెండు మనల్ని అటాక్ చేస్తున్నాయి. చేతనయినదంతా చేస్తున్నాం. మీరు కూడా జాగ్రత్తగా వుండండి" అన్నాడు.

"షోర్‌కు ఎంత దూరంలో వున్నాం సార్?" అడిగింది డెల్లా.

"దగ్గరగా వున్నాం. ఒక మైలు వుంటుందేమో. వాళ్లు అటూ ఇటూ కూడా వెంటాడుతున్నారు. మన సబ్‌మెరైన్ మధ్య ఇరుక్కుపోయింది" అన్నాడు షిర్లీ, మా ముందు నుండి కదలి వెనుక వైపు గదుల్లోకి వెళ్ళిపోతూ.

అతను వెళ్ళిన ఐదు నిముషాలకు మరో యిద్దరు యూనిఫాంలో వున్న సోల్జర్లు, ఆ వైపుకే వెళ్ళారు.

"ఇప్పుడు యుద్ధం జరుగుతూందా?" అడిగింది డెల్లా.

"ఉండాలి!"

"మరి వీళ్ళంతా ఇక్కడే వున్నారేం?"

"సబ్‌మెరైన్‌ల నిండా రకరకాల ఆయుధాలు, బాంబులు పేర్చి వుంటాయి. అంతా స్విచ్‌లతో ఆపరేట్ చేస్తారు. స్విచ్ నొక్కగానే పేలుతుంటాయి" అన్నాను.

"మన సబ్‌మెరైన్‌కేమీ తగిలినట్లు లేదు" అంది డెల్లా.

"ఏమో! తగిలినా మనకు తెలీదు" అన్నాను.

"ఈ యుద్ధంలో వీళ్ళు నెగ్గుతారంటావా?"

"ఈ పాటికి తాము ప్రమాద స్థితిలో వున్నట్లు మెసేజ్ ఇచ్చి వుంటారు బేస్‌కు. అది అందగానే ఇంకొన్ని సబ్‌మెరైన్‌లు, విమానాలు క్షణాల్లో వచ్చేస్తాయి" అన్నాను.

"వాళ్ళకు రావా?"

"వాళ్ళంటే?"

"అదే విరోధి కూటమికి" అంది డెల్లా.

"ఏమో? వాళ్ళ బేస్ ఎంతదూరంలో వుందో మనకు తెలీదుగా!" అంది డెల్లా.

ఎంతోదూరంలో వాళ్ళ బేస్ వుండివుంటే, తెలిసి తెలిసీ, మా సబ్ మెరైన్ తో యుద్ధానికి అతివేగంగా వాళ్లు తలపడి వుంటారని నమ్మలేకపోయాను. ఈ అటాక్ ఒక చిన్న సైజు నౌకాయుద్ధంలా మారే ప్రమాదం కనుపించింది.

ఉన్నట్టుండి నేను కూర్చున్న కుర్చీ పైకెగిరి బోల్తా కొట్టింది. దాంతోపాటు నేను తిరగబడ్డాను. క్రింద కార్పెట్ వుండడంతో పెద్ద దెబ్బేమీ తగల్లేదు.

డెల్లాకూడా అలాగే పడిపోయింది.

మెల్లగా లేచివెళ్ళి ఆమెను పైకిలేపాను.

"ఏమయింది?" అడిగింది.

"ఏమో?" అన్నాను.

"క్రిందేదో బాంబు ప్రేలినట్లుంది నీళ్ళల్లో. బహుశా పెద్ద అల ఏదో మన సబ్ మెరైన్ ను పైకెత్తి కుదేసి వుంటుంది." అంది డెల్లా.

"అలా పైకివెళ్ళి కనుక్కుందామా?" అన్నాను.

"వెళ్దాం పద" అంటూ ముందు నడచింది డెల్లా.

ఆమెను అనుసరించి నడవసాగాను.

యూనిఫాంలో వున్న అందరి మొఖాలు కత్తిగాటుకు నెత్తురుచుక్క లేనట్టు కొయ్యబారివున్నాయి. షివర్లీ ఏవేవో సూచనలిస్తున్నాడు. అతని సూచనల ననుసరించి, రకరకాల మీటలు నొక్కుతున్నారు. ఏవిధమైన శబ్దాలు వినిపించడం లేదు. అందరూ వాళ్ళవాళ్ళ పనుల్లో మునిగి

వున్నారు. మా రాక నెవ్వరూ, షివర్లీతోసహా, గమనించ లేదు.

"సార్!" దగ్గరగా వెళ్ళి నిలుచుని పలకరించింది డెల్లా షివర్లీని.

"యస్!" అంటూ తలత్రిప్పి "నువ్వా!" అన్నాడు అతను.

"నేనే! ఏమయింది?"

"వాళ్ళు భయంకరంగా పోరాడుతున్నారు మనతో. రెండువైపులనుంచి అటాక్ చేస్తున్నారు. ఇంతవరకూ మన సబ్ మెరైన్ వాళ్ళ మెషిన్‌గన్ రేంజికి దూరంగా వుంది. ఎంతోసేపు దీన్ని కాపాడగల ననుకోవడంలేదు!" నిరాశగా అన్నాడు షివర్లీ.

"సర్ఫేస్ పైకి వెళ్ళితే మనల్ని మనం రక్షించుకో గలమేమో?" అన్నాను మొదటిసారిగా నోరు విప్పుతూ.

"లాభం లేదు! వాళ్ళ విమానాలు రెండు తిరుగుతున్నాయి."

"మన విమానాలు రాలేదా?" అడిగింది డెల్లా.

"మెసేజ్ పంపాను. రెండు సబ్-మెరైన్‌లు, రెండు విమానాలు పంపమని. అది అందిందో, లేదో" అన్నాడు షివర్లీ.

"అందకుండావుండే అవకాశంకూడా వుందా?" అడిగాను నేను.

"నీకు తెలీదా?" ఎదురుప్రశ్న వేశాడు షివర్లీ.

"నాకెలా తెలుస్తుంది సార్!"

"ఎనిమీ ఏజెంటువు. మెసేజ్‌లు ఎలా ఇంటర్‌సెప్ట్ చేస్తారో తెలీదా?" అడిగాడు కోపంగా.

నోరు విప్పకుండావున్నా బాగుండే దనిపించింది నాకు. మాట్లాడకుండా నిలుచుని చూడసాగాను.

"రిగ్స్!" పిలిచాడు షివర్లీ.

యూనిఫాంలో వున్న ఒక ఆఫీసరు వచ్చాడు ఎదురుగా.

"సర్చ్ హిమ్ ఫుల్లీ!" అన్నాడు షివర్లీ.

రిగ్స్, నన్ను లాక్కెళ్ళాడు గదిలోకి. బట్టలన్నీ ఊడదీయించాడు. తలలో వ్రేళ్ళుబెట్టి జుట్టంతా వెతికాడు. చెవుల్లో చూశాడు. నోరు తెరవమన్నాడు. అంతకుముందు దాకా నేనున్న రూంకు తీసుకెళ్ళాడు. అక్కడంతా వెతికాడు. అతనికేమీ కనుపించలేదు. నన్ను మళ్ళా షివర్లీ వద్దకు తీసుకొచ్చాడు.

"ఏమైనా కనుపించాయా?"

"లేదు బాస్!"

"ఇతనే మన మూమెంట్స్ తనవాళ్ళకు ఏదో సీక్రెట్ డివైస్ద్వారా పంపివుండాలి!" అన్నాడు షివర్లీ.

"అలాంటిదేమీ కనుపించలేదు. కానీ బాత్రూంలో వున్న టవల్ స్టాండ్కు బిగించిన పైప్మాత్రం ఊడబీకి వుంది." అన్నాడు రిగ్స్.

"ట్రూ!" నమ్మలేనట్లు నావైపు చూస్తూ అడిగాడు.

అవునన్నట్లు తలూపాను.

"ఎందుకూడబీకావ్?" గద్దించి అడిగాడు.

నేను ఎందుకూడబీకింది చెప్పాను.

నా మాటలు పూర్తిగాక ముందే ఎడంకాలిబూటుతో ఎగసి పొట్టలో తన్నాడు షివర్లీ. ప్రేగులు కదిలినట్లయింది. జీర్ణకోశం అప్పడంలా అణిగిపోయినట్లయింది. గుడ్లు వెళ్ళుకొచ్చాయి.

టెలివిజన్ స్క్రీన్‌లో చూస్తున్న మరో ఆఫీసరు పెద్దగా అరచాడు. అందరూ అటుకేసి పరుగెత్తారు.

షివర్లీ వెళ్ళి కూర్చున్నాడు. నేనుకూడా మెల్లిగా వెళ్ళి వాళ్ళ వెనుక నిలుచున్నాను. నాకా స్క్రీన్ పైన రెండు సబ్ మెరైన్‌లు కనిపిస్తున్నాయి. వాటికి పదికాళ్లు, పది చేతులున్నట్లు, పెద్ద పెద్ద బోర్ గన్‌లు నీళ్ళలో పైకి లేచి ప్రేలుస్తున్నాయి గుళ్ళు. అవి సూటిగా మాకే గురి పెట్టినట్లున్నాయి.

ప్రక్కనున్న మరో స్విచ్ నొక్కారు. దాంట్లో సముద్రంపైన సర్కిల్‌గా తిరుగుతున్న విమానాలు కనుపించాయి. వాటి రెక్కలపై ఏవో మార్కులున్నాయి. అవే దేశానికి సంబంధించినవో వాళ్ళకు తెలిసినట్లుంది.

"ఉయ్ ఆర్ ఇన్ ఎ టైట్ కార్నర్!" అన్నాడు షివర్లీ.

"ఆర్డర్స్!" అడిగాడు రిగ్స్.

"క్రిందికి తీసుకెళ్ళండి సబ్ మెరైన్‌ను." అరచాడు షివర్లీ.

రిగ్స్ ప్రక్కనున్న ఆఫీసరు చకచక మీటలు మార్చసాగాడు. నాకు శరీరపు బరువు ఎక్కువవుతున్నట్లు తోచింది. నిలువున దిగిపోతున్న సబ్ మెరైన్‌ను చూసి విస్తుపోయాను.

సముద్రాల్లో వీళ్ళ యుద్ధాలు చూస్తే నాకు చాలా ఎక్సయిటింగ్‌గా వుంది. నాకూ కూడా వాళ్ళకు తోడుగా నిలబడి పోరాడాలని వుంది. కానీ అనుమానంతో నన్ను పురుగును చూసినట్లు చూస్తున్నారంతా. డెల్లానుమాత్రం అందరూ గౌరవిస్తున్నారు. ఆమెను దగ్గర కూర్చోబెట్టుకొని ప్రతిక్షణం ఏం జరుగుతున్నదీ చెప్తున్నారు.

సబ్ మెరైనులోనివాళ్ళంతా తమ పనుల్లో తాము మునిగిపోయారు. ఎవ్వరూ నావైపు రావటంగానీ, మాట్లాడటంగానీ చెయ్యటం లేదు. వెలివేసినట్లు ఒకమూలగా నిలబడి చూడసాగాను అందర్నీ.

డెల్లా అప్పుడప్పుడూ నాకేసి చూడసాగింది. ఆమె కూడా నా దగ్గరకు రావటానికి భయంగా వున్నట్లు తోచింది. ఏం జరుగుతూందో, ప్రమాదం తప్పించుకొనే సూచనలున్నాయో లేవో తెలుసుకోవాలన్న ఆతృత నాకూ అధికం అవుతూంది క్షణాలు జరిగేకొద్దీ. కానీ ప్రయోజనం లేదు.

నిల్చున్న స్థలంనుండి మెల్లిగా కదిలి, డెల్లా కూర్చున్న ప్రదేశానికి దూరంగా నిలబడ్డాను.

నావిగేషను వీల్ ముందు కూర్చున్న నలుగురు ఆఫీసర్లు ఏం చూశారో ఏమో ఠక్కున లేచి నిల్చున్నారు.

షివర్లీ వచ్చాడక్కడకు. వాళ్ళతో ఏదో సంభాషించాడు. స్క్రీను కేసి చూశాడు. అతని మొహంనిండా చెమట పట్టినట్లు లైటువెలుగులో చూచి గమనించాను.

"సో! వుయ్ హేవ్ నో హోప్! ఈజిట్!" అంటూండటం వినిపించింది నాకు.

"లుక్స్ లైక్ దట్!" రగ్స్ అన్నాడు.

"అందరూ లైఫ్ బెల్ట్స్ తీసుకోండి. నౌ ఎవ్విరిబడీ ఈజ్ ఆన్ దెయిర్ ఓన్!" అన్నాడు నింపాదిగా షివర్లీ.

అందరూ గబగబ గుండ్రటి గాలి నింపిన రబ్బరు ట్యూబులు మెడమీదిగుండా కిందికి దూర్చుకుని నడుంకు బిగించుకుని నిలుచున్నారు. డెల్లాకూడా అలాంటిదొకటి తగిలించుకుంది. నేను అలాంటిదానికోసం చూడసాగాను. ఎవ్వరూ ఆఫర్ చెయ్యలేదు.

"ఇక నేన్నే షూట్ చేస్తాను!" అన్నాడు రిగ్స్ నన్ను చూపిస్తూ.

"నో! అందరం ప్రమాదంలో వున్నాం. అతని చావు బ్రతుకులు మనం నిర్ణయించడంకన్నా, ఆ బరువుబాధ్యతలు భగవంతుడిపైనే వేద్దాం. మనకు ద్రోహం చేసివుంటే సముద్రంలోనే ఛస్తాడు. లేకుంటే బ్రతికి బయటపడతాడు. లీవ్ హిమ్ టు హిజ్ ఫేట్!" అన్నాడు షివర్లీ గంభీరంగా.

అతని ఉదారతకు, ఉదాత్తతకు మనస్సులోనే జోహారులర్పించాను. అదే వీరసైనికుల లక్షణం.

రిగ్స్ మాత్రం అయిష్టంగా వెళ్ళిపోయాడు.

షివర్లీ లైఫ్ బెల్ట్ తెచ్చి నాకందిస్తూ, "టేక్ ఇట్! మా ప్రాణాలకు నువ్వు ప్రమాదం తెచ్చినా, నీకు ప్రాణాలు రక్షించుకునే అవకాశం ఇస్తున్నాను" అన్నాడు.

అందుకుంటూ "సారీ సర్! మీరింకా నా గురించి తప్పు అభిప్రాయంలో వున్నారు. నాకేమీ తెలీదు."

"నువ్వు బ్రతికి బయటపడటం నేను చూడగలిగినప్పుడు నీ మాటల్లోని నిజాయితీని నమ్ముతాను." అన్నాడు షివర్లీ.

"అలాగే! నేను ఖచ్చితంగా బ్రతుకుతాను. బైట పడతాను." అన్నాను.

"లెట్ అజ్ సీ!" అంటూ వెళ్ళిపోయాడు తనవాళ్ళ వేపు.

డెల్లా నావద్ద కొచ్చింది.

"ఎలా వుంది పరిస్థితి?" అడిగాను ఆత్రుతగా.

"చాలా ప్రమాదకరంగా వుంది!" అంది డేల్లా.

"అంటే...!"

"రెండువైపులనుండీ రెండు సబ్ మెరైన్లు అటాక్ చేస్తున్నాయి. వాటికున్న గన్స్ చాలా పెద్దవిలా గున్నాయి."

"మనమున్న సబ్ మెరైన్నుండి కాల్పులు జరపడం లేదా?"

"జరిపారు. కానీ అవతలివాళ్ళు వీటి రేంజికి దూరంగా వుండే పోరాడుతున్నారు. అమ్యూనిషన్ అంతా అయిపో వస్తుందనుకుంటున్నారు. మరో అరగంటకన్నా ఎక్కువ పోరాడటం అసంభవమని షివర్లీతో రిగ్స్ చెప్తుంటే విన్నాను. ఈలోగా ఏదైనా సహాయం అందితే తప్ప, వాళ్ళ అటాక్నుండి తప్పించుకునే అవకాశమున్నట్లు లేదు!" అంది డెల్లా తను అంతదాకా గమనించిన విష యాల సారాంశం అదేనన్నట్లు.

"నువ్వు దూరం వెళ్ళకు. నాకు దగ్గరుండు" అన్నాను.

"అలాగే!" అంది డెల్లా.

క్షణాలు నిముషాలుగా మారుతున్నాయి. అందరి ప్రాణాలు అరచేతుల్లో పట్టుకొని వున్నాం. ఆతృత అంతకంతకూ ఎక్కువవుతూంది.

షివర్లీ నావిగేటింగ్ వీల్ దగ్గరున్న కళ్ళతో రెండు క్షణాలు సంప్రదింపులు జరిపాడు. వొంగి మీటర్లు చూశాడు. మళ్ళా లేచి నిలుచున్నాడు.

"నో యూజ్! ఓపెకపే!!" అరచాడు.

అంతే, సబ్ మెరైన్ రివ్వున నీళ్ళను చీల్చుకుంటూ, నీళ్ళ ఉపరితలంవేపు ప్రయాణం మొదలెట్టింది.

"ఎమర్జెన్సీ డోర్ తెరచుకోగానే అందరూ వెలుపలకు దూకెయ్యండి. ఇంకొకర్ని రక్షించాలన్న ప్రయత్నంలో మిమ్మల్ని మీరు ప్రమాదంలోకి లాక్కోకండి. ఇక్కడ్నించి షోర్ దాదాపు ఏడువందల మీటర్లుంది. దక్షిణంగా ప్రయాణం చేసేందుకు ప్రయత్నించండి. మిగిలిన మూడు దిక్కులూ సముద్రం తప్ప మరేం లేదు. మీకు అవసరమైన సామాన్లు తీసుకోండి. అంతా మీదే! థాంక్ యూ జంటిల్ మెన్!" అన్నాడు షివర్లీ.

అందరి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

నాకు కళ్ళు చెమర్చాయి. డెల్లా నా ప్రక్కకు వచ్చింది. మా సబ్-మెరైన్ ఉన్నట్లుండి ఒక ఊగు ఊగింది. ధన్ మని శబ్దమైంది.

"వాళ్ళ తుపాకీ దెబ్బ తగిలినట్లుంది" అన్నాడు రిగ్స్.

"అవును. మనదగ్గర అమ్యూనిషన్ అయిపోయినట్లు కనిపెట్టారులాగుంది" అన్నాడు షివర్లీ.

మరో రెండు నిముషాల్లో మా సబ్ మెరైన్ సర్ఫేస్ పైకొచ్చింది. 'ఎగ్జిట్' డోర్ ఠక్కున తెరచుకొంది. చకచక అందరూ వెలుపలకు దూకారు. అందరికన్నా వెనుక నిలుచున్నాను నేను. నా ముందు డెల్లా వుంది. షివర్లీ అక్కడే నిలుచున్నాడు.

"మీరు వెళ్ళండి!" అన్నాను.

"నో! ఈ మెరైన్ కమాండర్ను నేను. ఆఖరి వంతు నాది. గో అవుట్! క్విక్!" అన్నాడు షివర్లీ.

అతని క్రమశిక్షణకు, త్యాగానికి నా కళ్ళు చెమర్చాయి.

"థాంక్ యూ సర్!" అన్నాడు కళ్ళు తుడుచుకొంటూ.

"కారీ ఆన్! కారీ ఆన్!" అంటూ మమ్మల్నిద్దర్నీ వెలుపలకు తోసినట్లు నెట్టాడు. వెనుకకు తిరిగి చూచే అవకాశం కూడా దొరకలేదు మాకు.

ఇద్దరం నీళ్ళలోకి దూకాం.

దూరంగా నీళ్ళ మీద తేలుతున్న మనుషుల ఆకారాలు కనుపించాయి. మేం కూడా దక్షిణం వేపుకు ఈదుకుపోసాగాం. సంధ్య చీకట్ల వేళ అది.

పది నిముషాల్లోనే దట్టంగా చీకటి పేరుకునిపోయింది. రెండు గజాలకు మించి మరెక్కువ దూరం కనుపించడం లేదు.

"ఈదడం ఇంక నావల్ల అయ్యేట్లు లేదు" అంది అలసిపోయిన డెల్లా.

"నన్ను పట్టుకో!" అన్నాను.

ఆమె నా భుజాలు పట్టుకుంది.

నేను ఎక్కువ అలసిపోకుండా నిదానంగా ఈదసాగాను నిలుచునే.

"వాళ్ళెవరూ కనుపించడం లేదే?" అంది డెల్లా.

"ఎటు పోయారు?" అన్నాను.

"అందరూ దక్షిణం వేపే ప్రయాణించాలి కదా!"

"అవును."

"మనం మరెటన్నా పోతున్నామా?"

"లేదు. ఇందాక చీకటి పడక ముందు మనం ఏ డైరక్షనులో పోవలసిందీ గుర్తుపెట్టుకొన్నాను. అటే వెళుతున్నాం. అందులో ఏం సందేహం లేదు!" అన్నాను.

"సబ్ మెరైన్ లోంచి దూకి గంట కావస్తోంది. మరో గంట రెండు గంటలు తంటాలు పడితే తీరం చేరుకో

వచ్చు" అంది డెల్లా.

"అవును" అన్నాను ఈదుతూనే.

"అక్కడ మళ్ళీ వాళ్ళు కలిస్తే నిన్ను వదుల్తా రంటావా?"

"వదలరు. అందువల్లే వాళ్ళకు కలవగూడదు. మన దారి మనం చూసుకోవాలి!" అన్నాను.

"ఇదేం ద్వీపమో? ఎలాంటి వారుంటారో? ఇక్కడేం కష్టాలు పడాలో?" ఆలోచనగా అంది డెల్లా.

నేనేం సమాధానం చెప్పలేదు. సముద్రం ప్రశాంతంగానే వుంది. అలలుగానీ, కెరటాలుగానీ, అవి చేసే చప్పుళ్ళుగానీ వినిపించలేదు. అంటే తీరం చేరేందుకు మేం చాలా దూరంగా వున్నట్లు తోచింది.

నాకు శక్తి సన్నగిల్లిపోయింది. బాగా అలసిపోయాను. దానికి తోడు డెల్లాను కూడా మొయ్యడంతో కాస్త తొందరగానే డీలా పడిపోయినట్లుందనుకున్నాను.

"డెల్లా!" పిలిచాను.

"ఆఁ!" అంది.

"బాగా అలసిపోయాను నేను కూడా. కాసేపు ఇలా నిలబడే రెస్ట్ తీసుకుందాం! ఆ తర్వాత కాస్త ఓపిక చిక్కాక ఈదుకుంటూ పోదాం!" అన్నాను.

"అలాగే!" అంది డెల్లా.

అయిదు నిముషాలు రెస్టు తీసుకొన్నాము.

ఉన్నట్లుండి, "మనల్ని ఎటాక్ చేసిన సబ్ మెరైన్లు ఏమయినట్లు?" అడిగింది డెల్లా.

"ఏమో! దాంట్లోంచి దూకిన జనం కోసం గాలిస్తున్నాయో లేక ఖాళీగా వున్న సబ్ మెరైన్ను చిక్కించు

కొని తమతోటి లాక్కుపోతున్నాయేమో?'' అన్నాను.

మళ్ళీ ఈదటం మొదలెట్టాం మేమా తీరం వేపు.

రెండు గంటల పైనే ఈదుకొచ్చాం. పెద్ద పెద్ద అలలు చేస్తున్న హోరు వినిపించింది. ఆ శబ్దం వినగానే నాకు ఆనందం కలిగింది. డెల్లాకు చెప్పాను ఆ తీరానికి దగ్గరగా వున్న విషయం.

అలల దాపుకు వచ్చాం. పది పన్నెండు అడుగుల ఎత్తున పైకిలేస్తూ పడుతున్నాయి. ఒక వంద గజాల దూరం అలా భీభత్సంగా వుంటుంది సముద్రం తీరం వెంట ఎప్పుడూ. ఆ దూరం దాటడమే కష్టం. ఇద్దరం విడిపోయే ప్రమాదముంది. అలలు పైనుండి ఈదుకుపోవడం చాలా ప్రమాదకరమైన పనేగాను, ఎంతో మెలకువా, నేర్పూ వుండాలి.

''డెల్లా!'' పిలిచాను.

ఆమె పలికింది.

''జాగ్రత్తగా వుండాలి. నన్ను పట్టుకొనే వుండు. లేకుంటే ఇద్దర్నీ చెరో వైపు విసరికొడతాయి అలలు. ఆ తర్వాత ఒకర్నొకరం కలుసుకోవటం కూడా కష్టమే అవుతుంది'' అన్నాను.

డెల్లా నా భుజాలు రెండూ ఘట్టిగా పట్టుకుంది. ఆమె బలమైన రొమ్ములు నా వీపుకు హత్తుకున్నాయి. మామూలుగా వచ్చే వుద్రేకంగానీ, ఉత్సాహంగానీ రాలేదు. నేను చేతులు ఆడిస్తూ ముందుకు జరగడం ప్రారంభం చేశాను.

ఎత్తైన నీళ్ళచుట్ట నా క్రిందికి వచ్చింది. అది పెద్ద అలగా మారుతుందని నాకు తెలుసు. డెల్లాను ఘట్టిగా

పట్టుకోమన్నాను. క్రింద నుంచి పెద్ద వేగంతో లేచింది అల. తనతో పాటు మమ్మల్నిద్దర్నీ పదడుగుల ఎత్తుకు లేపింది. అక్కడ్నించి తక్కున మళ్ళీ జారిపడ్డాం నీళ్ళ మీద. మా ఇద్దరికీ బాలన్సు తప్పింది. తలలు ముందు నీళ్ళలో పడ్డాయి. కళ్ళలోకి, ముక్కుల్లోకి నీళ్ళు పోయాయి. వూపిరి కూడా ఆడలేదు నాకో క్షణం.

అంత అయోమయంలోనూ నా భుజాల్ని పట్టుకొనే వుంది డెల్లా. మా నడుంలకు లైఫ్ బెల్టులున్నాయి గాబట్టి నిముషంలోనే యధాప్రకారంగా తలలు పైకి వాటంత టవే వచ్చాయి. చేతుల్తో కళ్ళు తుడుచుకున్నాను. వెనక్కి చూశాను. గుండె పగిలింది.

పెద్ద కెరటం వచ్చేస్తూంది. స్టడీగా నిలుచుందామను కునేంతలోనే మమ్మల్ని మోసుకొని ముందుకు వెళ్ళిపో యింది. దాని విసురుకు దాదాపు వంద గజాల దూరంలో పడ్డాం.

తమాయించుకుని నిలుచుంటూ చూశాను. తెల్లటి పొడ వైన చేపలు చుట్టూ కనుపించాయి మసగ్గా. ఆకాశంలో కూడా నెలవంక మొలిచింది. కాస్త వెలుతురు పైనుంచి నీళ్ళపై పడుతూంది. ఆ వెలుగులో మరోమారు గమనించి చూశాను. చాలా చేపలున్నాయి. అవి అందంగా అటూ ఇటూ వూగుతూ, తిరుగుతున్నాయి. వాటి శరీరం మీద ఆకురాయిలాంటి కప్పుంది. ఆ కప్పుపైన లావుపాటి పొలు సులు కనుపించాయి.

దాన్ని చూడగానే మతి పోయింది నాకు. అలా వుండేవి షార్క్ చేపలని తెలుసు నాకు. తిమింగిలాల కన్నా ఇవి చాలా ప్రమాదకరమైనవి.

షార్క్ చేపలు ఆహారాన్ని కనిపెట్టే విధానాలు, ఆ తర్వాత దాన్ని సంపాదించుకునే పద్ధతులు నేను సైన్స్ జర్నల్‌లో చాలా దినాల క్రితం చదివాను. అది గుర్తొచ్చి గుండెలు గుభేలు మన్నాయి.

"జెల్లా!" పిలిచాను.

"ఏమిటి?" అంది.

"మన చుట్టూ షార్క్‌లున్నాయి. చాలా కేర్‌ఫుల్‌గా వుండాలి!" అన్నాను.

"చేపలేం చేస్తాయి?" అమాయకంగా అడిగింది.

"ప్రాణాలు తీస్తాయి!" అన్నాను.

"నిజంగానా?"

"అఁ! వాటి గురించి చాలా రోజుల క్రితం చదివాను" అన్నాను.

నా మాట పూర్తికాక ముందే మరో కెరటం వెనుక నుండి వచ్చి మమ్మల్ని మరికొంత ముందుకు తోసేసింది. మళ్ళీ తెప్పరిల్లుకుని లేచి నిలుచున్నాం.

"షార్క్‌ల సంగతి చెప్తూ ఆపేశావ్?" గుర్తు చేసింది

"అఁ! అవి ఏదైనా జంతువుకో, మనిషికో ముందు తమ శరీరంతో రాసుకొంటాయి. వెంటనే అర్థమవుతుందట అది తమకు ఆహారంగా పనికొచ్చే ప్రాణి అని. ఆ వెంటనే ఆ ప్రాణి శరీరాన్ని తన చర్మంపైనున్న ఆకురాయిలోటి వుపరితలంతో అదేపనిగా రుద్ది రుద్ది ముందు గాయం చేస్తుందట. గాయం కాగానే అందులోంచి రక్తం కారుతూంది. ఆ రక్తం నీళ్ళలోకి కలియగానే షార్క్‌లకు వాసన తెలుస్తుంది. చుట్టుప్రక్కలున్న మొత్తం షార్క్‌లు ఆ ప్రాణి చుట్టూ చేరుతాయి" అన్నాను.

మేము వేసుకున్న యూనిఫాంలు మోకాళ్ళ దగ్గర రక్షణ లేకుండా చేశాయి. పాదాల నుండి మోకాటి చిప్పలదాకా సాక్స్ వున్నాయి. ఆ తర్వాత హాఫ్ పాంట్లు తొడుక్కున్నాం. హాఫ్ షర్టులు వేసుకున్నాం గాబట్టి మోచేతుల దగ్గరనుండి రక్షణ లేదు.

"తర్వాతేం చేస్తాయో చెప్పలేదు!" అడిగింది డెల్లా.

"గాయం కాగానే, షార్క్‌లు దాని చుట్టుచేరి, తమకున్న కోరల్లాంటి సాధనాల్తో రక్తం పూర్తిగా పీల్చేస్తాయి. వాటి స్పీడు ఎంత భరించరానిదంటే, ఒక మనిషిలోని మొత్తం రక్తం పీల్చడానికి రెండు నిముషాలు చాలని పరిశోధకులు కనుక్కున్నారు" అన్నాను.

"అమ్మో! అంత ప్రమాదకరమా?" ఆశ్చర్యపోయి అడిగింది.

"చాలా ప్రమాదకరం! జాగ్రత్తగా వుండు" అన్నాను.

"గాయం కాకుండానూ, లేదా గాయం అయ్యాక రక్తాన్ని అవి పీల్చకుండానూ తప్పించుకొనే మార్గం లేదా?" అడిగింది డెల్లా.

"గాయం కాకుండా వుంటాలంటే శరీరానికి ఏదన్నా ఆచ్ఛాదన వుండాలి. అది లేనప్పుడు గాయం అవుతుంది. గాయం అయ్యాక రక్తం రాకుండా చూసుకోవాలి. అది అంత సులభం కాదు. వాటికి చిక్కకుండా వడి వడిగా తీరం చేరుకోవాలి. అదీ అంత సులభమైనదేం కాదు. ఇందులో వున్న ప్రమాదమల్లా, అవి మన శరీరంపైన గాయం చేసిన విషయం ఒక పట్టాన తెలియకపోవడం" అన్నాను.

"నిజమే! మనం నీళ్ళల్లో వున్నాం. గాయమయినా

మన శరీరం నీళ్ళల్లో వుంటుంది గాబట్టి తెలుసుకోలేం!" అంది డెల్లా నే చెప్పింది నిజమన్నట్లు.

వెనుకనుండి ఈమారు చాలా ఎత్తున కెరటం చాప చుట్టలా చుట్టు తిరుగుతూ వచ్చింది. మమ్మల్నిద్దరినీ బలమైన పక్షి వచ్చి తన్నుకుపోయినట్లు, మా క్రిందనుంచి దూరి పైకెత్తి అలవోకగా ముందుకు తోసేసింది.

అక్కడ చుట్టూ షార్క్‌లు వున్నాయి. అన్నీ బలంగా వున్నాయి. అడుగు పొడుగున వున్నాయి.

"డెల్లా!" పిలిచాను.

"ఆఁ!" అంది ఆమె.

"బీ కేర్‌ఫుల్! ఇక్కడ చాలా వున్నాయి. సాక్స్ పైకల్లా లాక్కో!" అన్నాను నేను కూడా అలాగే చేస్తూ.

షార్క్‌లు నా షర్టుని రాసుకుంటున్నాయి.

"రాజ్! లెటజ్ గో క్విక్!" అంది డెల్లా. వాటి సంగతి తెలిశాక ఆమెకి భయంగా వుంది. నాకూ భయంగానే వుంది. ఇంకొంత ముందుకు పోయాం. తీరం కనుపించసాగింది వెన్నెల్లో తెల్లగా.

మాకూ తీరానికీ మధ్య వంద గజాల దూరం వుంటుంది బహుశా. ఈ వంద గజాలు దాటితే మళ్ళీ కొంత స్వేచ్ఛ, వూరట కలుగుతాయి.

లైఫ్ బెల్ట్ పైన ఆనించాను చేతులు. మెల్లిగా కదుపుతున్నాయి. ఒక షార్క్ ఎగిరి నా చేతిని తన్నింది. ఆకు రాయి గీచుకున్నట్లయింది. మంట పుట్టింది. కళ్ళ దగ్గరగా పెట్టుకొని చూశాను. ఎర్రగా రక్తం వూరసాగింది. నాకు మతిపోయినట్లయింది.

"డెల్లా!" పిలిచాను పెద్దగా.

ఆమె నాకేసి చూసి ఏమిటన్నట్లు అడిగింది కళ్ళతోనే.

"నన్నూ అటాక్ చేశాయి, షార్క్‌లు!" చెప్పాను.

"నిజంగానా?" కలవరపడుతూ అడిగింది.

నా చుట్టూ పెద్ద గుంపు చేరింది. నిజానికి నా శరీరానికి నీళ్ళు తగలడం లేదు, షార్క్‌లు తప్ప. గాయమైన చెయ్యి నీళ్ళకు తగలకుండా గాలిలోకి పైకెత్తి పట్టుకొన్నాను. రెండో చేత్తో, నేను మునిగిపోకుండా వుండేందుకు, నీళ్ళను నా క్రిందికి తోసుకోసాగాను. ఆ ప్రయత్నం అతి కష్టంగా వుంది.

"జాగ్రత్త!" అంది డెల్లా.

"త్వరగా తీరం చేరుకోవాలి! లేకుంటే మన రక్తం త్రాగుతాయి."

"ఇంతదాకా నా వొంటిపైన ఏవిధమైన గాయం కాలేదు. కానీ చుట్టూ తిరుగుతున్నాయి" అంది డెల్లా.

వాట్ని తప్పించుకొంటూ, మునిగిపోకుండా ముందుకు ఈదుతూ, అలల తాకిడికి ముందుకు తూలిపడిపోకుండా మమ్మల్ని మేము కాపాడుకుంటూ, అతి ప్రయాసతో అరగంటసేపు తంటాలుపడి మొత్తానికి తీరం చేరుకున్నాం.

నీళ్ళ అంచుకు కొంచెం దూరంగా ఒత్తుగావున్న ఇసుక తిన్నెమీద పడిపోయాం శవాల్లా. మాటా పలుకూ లేదు మా మధ్య. గుండెలనిండా గాలి పీల్చుకొనటం, వదలటం మినహా మరేమీ చెయ్యలేకపోతున్నాం.

అలాగే గంటసేపు పడివున్నాం.

నేను మెల్లగా మోచేతులపైన బరువంతా ఆన్చి లేచి

కూర్చున్నాను. డెల్లాకేసి చూశాను. ఆమె కళ్ళు మూసుకుని పడుకునే వుందింకా.

"డెల్లా!" పిలిచాను.

"ఆఁ!" అంది కళ్లు తెరచి.

"ఆకలిగా వుందా?"

అవుననన్నట్లు తల ఊపింది.

నాకూ ఆకలిగానే వుంది. తినేందుకేమీ లేదు మా దగ్గర. జేబులు తడుముకున్నాను. సిగరెట్లు కూడా తడిసి ముద్దయిపోయాయి. వెనక్కి చూశాను. కనుచూపుమేర ఇసుక తప్ప మరేం లేదు. సముద్రపు హోరుమాత్రం జోరుగా వినవస్తూనే వుంది.

డెల్లా కూడా మెల్లగా లేచి కూర్చుంది.

"మనతోపాటు సబ్‌మెరైన్ నుండి తప్పించుకున్న వాళ్ళు కూడా ఈ తీరమే చేరివుంటారు గదూ!" అడిగింది.

"ఏమో? అయినా వాళ్ళ గొడవ నీకెందుకు?" అడిగాను.

"మళ్ళీ వాళ్ళ కళ్ళల్లో పడితే......" భయంగా అడిగింది.

"ఇప్పుడేం చెయ్యలేరు. అయినా వాళ్ళు అసలు తీరం చేరగలిగారో లేదో?" నా అనుమానం వ్యక్తంచేశాను.

"వాళ్లు తీరం చేరకుంటే మంచిదే!" అంది డెల్లా.

నాకేమీ పాలుపోలేదు. అన్నింటికన్నా ముందు ప్రేగులు పటపటమని తెగిపోయేంత ఆకలిగా వుంది. అది చల్లారితేగాని మెదడు పనిచెయ్యదు. అది చల్లారే మార్గం ముందు చూడాలనుకున్నాను. అక్కడే కూర్చుని తపస్సు చేసినందువల్ల ప్రయోజనం శూన్యం. ఓపిక, శక్తీ, లేకున్నా

నడవాలి ముందుకు. అప్పుడే ఏదన్నా దారి దొరుకుతుం దనిపించింది.

ఇద్దరం నడక మొదలెట్టాం.

మసక చీకటిని చీల్చుకుంటూ, మెత్తటి ఇసుకను తొక్కుకుంటూ, నిదానంగా అడుగులేస్తూ, కదలిపోయాం.

అలా ఎంతదూరం నడిచామో తెలియదు. కానీ బాగా వెలుతురు వచ్చేసరికి చిన్న చిన్న పొదలు, తుప్పలు, రాళ్లు వున్న ప్రదేశం చేరుకున్నాం. అక్కడికి సముద్రం కను పించడం లేదు. దాని హోరు కూడా వినిపించడం లేదు.

ఇంకా ముందుకు నడిచాం. కాళ్ళకు ముళ్ళపొదలు తగిలి, చిన్న చిన్న గాయాలయి రక్తం కారసాగింది. అయినా మొండిగా నడక సాగించాం. ఎత్తైన పెద్ద కొండొకటి అడ్డంగా కనుపించింది. దాని వెనుక వేపుకు వెళ్లేందుకు ఎక్కిపోవడంకన్నా మరో మార్గం లేదు. ఏదైనా దారిలాంటి దేదన్నా కనుపిస్తుందేమోనని ఆశగా అటూ యిటూ చూశాను.

"ఇంతదూరం నడిచాం! మనుషులమాటటుంచి కనీసం ఒక్క జంతువుకూడా కనుపించలేదు. ఎందుకని?" అడిగింది డెల్లా అనుమానంగా.

"ఏమో?" నాలోనూ అదే అనుమానం తలెత్తింది అంతకుముందుగానే.

"కొండెక్కాల్సిందేనా?"

"అంతకన్నా మరో గత్యంతరం లేదు. అవతలివేపు ఎవరన్నా మనుషులు కనుపిస్తారేమో?" అన్నాను ఆశగా.

"ఈ అడవుల్లో వుండే మనుషులంటే నాకు చచ్చేంత

భయంగా వుంది. పులి నోటినుండి తప్పించుకుని సింహం గుహాలో దూరినట్లవుతుందేమో?'' అంది డెల్లా నిరాశ నిస్పృహాలు గూడుకట్టుకున్న గొంతుకతో.

"అయినా తప్పదు! అంతకన్నా మనకు మరో దారి లేనప్పుడు ఏంచేస్తాం?'' అన్నాను.

పెద్దపెద్ద రాతిగుండ్లు ఒకదానిపైన ఒకటి పేర్చి యెత్తుగా చేసినట్లుంది ఆ కొండను. ఇద్దరం ఒక్కొక్క రాయిపైనుండి మరోదానిపైకి దుముకుతూ, అంచెలంచెలుగా పైకెక్కసాగాం. గంటసేపు తంటాలుపడ్డాక సగం యెత్తుకు మాత్రం చేరగలిగాం. అక్కడినుండి కత్తితో తెగగొట్టినట్లు నిటారుగా చదరంగా వుంది కొండ. ఎలా యెక్కాలా అని ఆలోచించసాగాను.

పదడుగుల యెత్తులో లావుపాటి కాండం వున్న చిన్న చెట్టొకటి కనుపించింది. అక్కడికి చేరుకుంటే, అంత కష్టం లేకుండా పైకి వెళ్ళిపోవచ్చు. కానీ అక్కడికి చేరుకోవడం యెలాగన్నదే పెద్ద సమస్య. ఆలోచించసాగాను. నేను దాదాపు ఐదడుగులా ఎనిమిదంగుళాలున్నాను. డెల్లా నాకన్నా రెండంగుళాలు యెత్తు తక్కువుంటుంది. ఆమె భుజంపైకి నేనెక్కి నిలుచుంటే. ఆ చెట్టు కాండం అందవచ్చుననుకున్నాను.

నా ఆలోచన డెల్లాకు చెప్పాను. విని తలూపింది.

వెంటనే కొండ చరియకు అభిముఖంగా ఆమెను మోకాళ్ళపై కూర్చోమన్నాను. నేను రెండుకాళ్ళూ ఆమె రెండు భుజాలపైన పెట్టి బరువు మొత్తం ఆమెపైనే పడకుండా కాస్త పొంగి దమ్ముపట్టి, చేతుల్ని కొండ భాగానికి ఆన్చి నిల్చున్నాను.

"రెడీయా!" అడిగింది డెల్లా.

"ఆఁ!" అన్నాను.

డెల్లా మెల్లగా పైకి లేవసాగింది. ఆమె లేచేకొద్దీ నేను పైకి పైపైకి పోసాగాను. ఆమె పూర్తిగా లేచింది. చేతులెత్తి చెట్టు కాండం దొరకపుచ్చుకొన్నాను. వెంటనే భుజాలపైనుంచి కాళ్లెత్తి గాలిలోకి ఊపసాగాను. అలా ఊపుతూనే పట్టు గట్టిచేసుకున్నాను.

రెండు చేతుల్తో డెల్లా నాపాదాలు పట్టుకుంది గట్టిగా. నేను బలమంతా కూడగట్టుకొని బస్కీ తీసినట్టు అభిన యిస్తూ శరీరాన్ని పైకి లేపసాగాను. శరీరంలో శక్తి లేక పోవటం, ఆకలితో నీరసించి వుండటంవల్ల, ఆమెను పైకి లాగేందుకు చాలా శ్రమపడాల్సి వచ్చింది. ఐదు నిముషాలు తన్నుకులాడాక ఇద్దరం కాండం పైకి చేరుకొన్నాం.

అక్కడే కూర్చున్నాం కొంతసేపు గాలి పీల్చుకునేం దుకు. మరో పదిగజాలు పైకి ఎక్కితే తప్ప కొండశిఖరం చేరలేం. అక్కడ్నుంచి గమనించి చూశాను. చేతుల్తో పట్టుకొనేందుకూ, కాళ్ళు పెట్టుకునేందుకూ, రెండుమూడు చోట్ల మేకుల్లాంటి పొడవుపాటి రాళ్ళున్నాయి. వాటి సాయంతోనే పైకి చేరుకున్నాం. అక్కడ నిలుచుని చూశాం. కనుచూపుమేర పెద్ద అడవి తప్ప మరేం లేదు. కానీ మధ్యగా వందగజాల ఎత్తున్న పెద్ద టవర్ కనుపిం చింది. దాని చుట్టూ ఆధునాతనంగా కట్టిన బిల్డింగు అగ్గి పెట్టెలా అవుపించింది.

"అక్కడ ఏదో బిల్డింగులాగుంది. అక్కడ మన కేమన్నా ఆహారం దొరకొచ్చు. అదృష్టముంటే నాగరికు లైన మనుషులు కూడా కనుపించవచ్చు" అన్నాను.

"అయితే ఆలస్యం ఎందుకు? అటుగా వెళ్ళిపోదాం!" అంది డెల్లా.

మాట్లాడకుండా క్రిందకు దిగడం మొదలెట్టాను. డెల్లా కూడా మౌనంగా వెంట రాసాగింది.

రాళ్ళను దాటుతూ, తుప్పల్ని తప్పుకుంటూ, అలా నడవసాగాం మేము కొండపైనుండి చూసిన బిల్డింగు వేపు. త్రోవలో యెవ్వరూ యెదురురాలేదు. ఎక్కడా నర సంచారం లేదా దీవిలో. అంతకన్నా ఆశ్చర్యకరమైన విషయమేమంటే ఒక్క జంతువుకానీ, పక్షిగానీ కనుపించలేదు. అది నాకు వింతల్లోకల్లా విచిత్రంగా తోచింది. నా మనస్సులో కలుగుతున్న భావాల్ని, రేగుతున్న అనుమానాల్ని, డెల్లాకు తెలియపరచటం ఇష్టంలేకపోయింది.

ఎండ బాగా ఎక్కువైంది.

గుండెలు తీవ్రంగా కొట్టుకొంటున్నట్లు తోచింది. చాలినంత గాలి ఊపిరితిత్తులకు అందుతున్నట్లు అనిపించలేదు. ముక్కుపుటాలు ఇంకా పెద్దవి అయితే బాగుండుననిపించింది.

"రాజ్!" పిలిచింది డెల్లా.

ఏమిటన్నట్లు చూశాను.

"ఎందుకో ఊపిరి తీసుకోవడం కష్టంగా వుంది" అంది.

"నాకూ అలానే వుంది!" అన్నాను.

"ఎందువల్ల?" అడిగింది.

వెంటనే సమాధానం స్ఫురించలేదు. తిండిలేకపోవడం వల్ల, నీరసం ఎక్కువ కావడంతో, అలా అనిపిస్తుందేమోననుకున్నాను. అయినా మాట్లాడకుండా ముందుకు నడవసాగాను.

కొండ శిఖరం నుంచి చూస్తే ఆ బిల్డింగు దగ్గరగా వున్నట్లనిపించింది. కానీ నడుస్తుంటే ఎంతకూ దగ్గర కనపడకపోవడం బట్టి బాగా దూరంగానే వుందను కున్నాను.

మాటా పలుకూ లేకుండా మౌనంగా నడవసాగాను. నా వెంట డెల్లా కూడా అలాగే మౌనంగా రాసాగింది.

పెద్ద కాంపౌండ్ అడ్డొచ్చింది. లోపలవైపు చెట్టు ఒక్కటీ లేదు. గోడ దగ్గర్నుంచి ఫర్లాంగు దూరంలో వుంది బిల్డింగు. దాని పీఠభాగం వర్తులాకారంలో వుంది. పైకిపైకి పోయేకొద్దీ సన్నగా కనుపించింది. మొత్తం ఆర్. సి. సితో తయారుచేసినట్లుంది.

ఇద్దరం గోడ దూకి లోనికెళ్ళాం. బిల్డింగు దగ్గరకు నడచాం. క్రింది అంతస్తుకు మొత్తం ఐదు తలుపు లున్నాయి. అన్నీ లాక్ చేసి వున్నాయి. ఒక తలుపు పైన 'ఎంట్రెన్స్' అని రాసివుంది. మనుషు లెవరన్నా కనుపిస్తా రేమో నని చుట్టూ చూశాను. ఎవ్వరూ లేరు.

"ఇంత పెద్ద టవర్ ఎందుకు కట్టారో ఇక్కడ?" అడి గింది డెల్లా.

"అదే నాకూ అర్థంకావడం లేదు!" అన్నాను, ఆ తలుపు లెలా తెరవాలాని ఆలోచిస్తూ. దూరంగా లావు పాటి రాయి కనుపించింది. వెళ్ళి తెచ్చాను. దాన్ని రెండు చేతుల్లో పట్టుకొని తలుపుకేసి కొట్టాను. అది కద ల్లేదు. దాని తాళంకేసి చూశాను. వీల్ టైప్ లాక్ బిగించి వున్నారు ఆ తలుపుకు.

"తెరచి ఏం లాభం?" అడిగింది డెల్లా.

"తినేందుకేమైనా దొరకొచ్చు. మార్చుకునేందుకు బట్టలేవన్నా దొరుకుతాయేమోనన్న ఆశగా వుంది!" అన్నాను.

"గేటువైపు వెళ్ళి చూసేదా! వాచ్ మెన్ లాంటివా డెవడైనా ఉన్నారేమో తెలుస్తుంది! అంది డెల్లా.

"గుడ్! ప్రయత్నించు" అన్నాను.

డెల్లా వెళ్ళిపోయింది.

నేల తలుపుకేసి పరీక్షగా చూడసాగాను. ఏవిధమైన ఉపాయం తోచలేదు నాకు. పొడవుపాటి సన్నటి ఇనుప రాడ్ లాంటి దేదైనా దొరికితే, దాంతో తీసేందుకు ప్రయత్నించవచ్చనుకున్నాను. అలా తాళాలు తీయడంలో నాకు మంచి నేర్పు వుంది. స్మగ్లింగ్ వ్యాపారంలో వుండగా ట్రయినింగ్ పొందాను ఆ విద్యలో.

డెల్లా వచ్చింది.

"ఏమయింది?" అడిగాను.

"వాచ్ మెన్ క్వార్టర్సు వున్నాయి. కానీ అవీ తాళం వేసి వున్నాయి. ఎవ్వరూ లేరు!" అంది. నా దృష్టి ఆమె చేతిలోవున్న సన్నటి ఇనుపరాడ్ పై పడింది.

"అదెక్కడిది?" అడిగాను.

"దొరికింది!" అంది.

ఆ రాడ్ ను అందుకుని, ఒక చివర్ని కొద్దిగా వంచాను. ఆ వొంచిన భాగాన్ని మెల్లగా తాళం రంధ్రంలోకి దోపాను. కుడివైపుకూ, ఎడంవైపుకూ రెండుసార్లు త్రిప్పి లోపలున్న లివర్లను పట్టుకొనేందుకు ప్రయత్నించాను. కానీ ఫలితం లేకపోయింది. కొంత ముందుకు లాగి

అలాగే త్రిప్పాను. లాభంలేకపోయింది. కాస్త వెనక్కి త్రోసి త్రిప్పాను. క్లిక్ మంది. లాక్ వూడింది. తలుపులు నెట్టాను. లోపల చీకటిగా వుంది.

ఇద్దరం లోనికి వెళ్ళాం. అక్కడున్నుంచి పైకి మెట్లు కనిపించాయి. కుడివేపు మరో తలుపు కనుపించింది. దాన్ని నెట్టాను తెరచుకుంది. రకరకాల యంత్రాలు వున్నాయి. అవన్నీ ఎందుకుపయోగిస్తారో, వాటితో ఏం చేస్తారో నాకు అర్థంకాలేదు.

డెల్లా కూడా విస్తుపోతూ వాటికేసి చూడసాగింది. అక్కడెక్కడా మాకూ ఏవిధమైన ఆహార సామగ్రి కనుపించలేదు. అవి మూసి వెలుపలికొచ్చాం.

మెట్లెక్కి మొదటి అంతస్తు చేరాం. అక్కడున్న తలుపులు తెరచాం. లోపల నాలుగైదు అల్మైరాలనిండా బిస్కెట్ పాకెట్లు, వండిన ఆహారం టిన్నులు, సిగరెట్లు, అగ్గిపెట్టెలు, సబ్బులు, బట్టలు, మొదలైన అన్ని రకాల నిత్యావసరవస్తువులు కనుపించాయి. మా ఆనందానికి అంతులేకపోయింది.

అద్దాలు పగులగొట్టి ఇద్దరం కావలసినన్ని టిన్నులు తీసుకొని గది మధ్య పెట్టుకొని కూర్చున్నాం. చిన్నగా తినటం ప్రారంభించాం. దప్పికయింది. నీళ్ళకోసం వెతికాను. అక్కడ కనుపించలేదు. మూలగా నున్న ఫ్రిజ్ తెరచాను. అందులో బీర్, విస్కీ, జిన్ లాంటి రకరకాల మత్తుపదార్థాల సీసాలు కనుపించాయి.

రెండు బాటిల్స్ తీశాను.

నా కెందుకో ఊపిరి అందడం కష్టంగా వుంది. బహుశా

తగినంత గాలి ఆ గదిలో లేదేమో ననుకున్నాను. అవి తెచ్చి డెల్లా ముందుపెట్టి కూర్చున్నాను.

"ఊపిరాడడం లేదు!" అంది డెల్లా.

"నీకూ అలానే వుందా? నాకూ అలాగే అనిపిస్తూంది. ఎందుకూ?" అన్నాను బాటిల్ మూత తీస్తూ.

"ఈ రూంలో గాలి చాలటం లేదనుకుందామా అంటే, నాకు ఈ దీవిలో అడుగు పెట్టినప్పట్నుంచీ అలానే అనిపించింది. అందువల్లే ఎక్కువ అలసిపోయినట్లు ఫీలవుతున్నాను" అంది డెల్లా.

"నాకూ అలాగే అనిపించింది. అయినా ఆ ఫీలింగు ఆకలివల్ల, అలసటవల్ల నని సర్ది చెప్పుకొన్నాను నాలో నేనే.

కడుపునిండా తిని, చెరి రెండు బాటల్స్ జిన్ త్రాగాం. సిగరెట్లు ముట్టించుకొన్నాం. దమ్ము లాగ్గానే విపరీతమైన దగ్గొచ్చింది. డెల్లా కూడా అలానే దగ్గలేక మెలికలు తిరిగిపోసాగింది. ఇద్దరం సిగరెట్లు విసరి వేశాం దూరంగా.

ఈ బిల్డింగు ఎవరిదో, ఎందుకు కట్టారో, క్రింద అంతస్తులో మాకు కనుపించిన యంత్రాల ప్రయోజనమేమిటో తెలుసుకోవాలనుకున్నాను. డెల్లాను లెమ్మని చెప్పాను. ఇద్దరం మూడో అంతస్తు చేరుకున్నాం. మెట్లవారగా వున్న తలుపు తీశాం. దాన్నిండా అందమైన బీరువాల నిండా అమర్చిన పుస్తకాలు కనుపించాయి. కొన్నింటిని లాగి పైనున్న పేర్లు చదివాను. అన్నీ వాతావరణ పరిశోధన శాస్త్రానికి సంబంధించినవే!

ఒక గోడనిండా కొన్ని మ్యాప్‌లు కనుపించాయి. భూమధ్యరేఖకు నిలువుగా గీయబడిన జీరో డిగ్రీల రేఖాంశము కలిసిన ప్రదేశం చుట్టూ ఎర్ర సిరాతో పెద్ద వలయం చుట్టి వుంది. ఆ వలయములో చిన్న దీవి కనుపించింది. ప్రక్కనున్న మ్యాప్‌లో ఆ దీవి నైసర్గిక స్వరూపం చిత్రించివుంది. మధ్యగా మరో ఎర్రటి వలయం కనుపించింది. దాంట్లో వున్న గుర్తుకు క్రిందివేపు "ఐక్యరాజ్య సమితివారి వాతావరణ పరిశోధనా కేంద్రము" అని వ్రాసి వుంది. దాని ప్రక్కన మేమున్న బిల్డింగు ప్లాన్ వేసి వుంది. అంతా తాపీగా చూశాను. డెల్లా కూడా నా వెనుకే నిలుచుని చూడసాగింది. నేను సైన్సు స్టూడెంట్‌ను కావడంవల్ల సహజంగానే కొంత ఆతృత, అవి చదివితే అవసరమైన విషయాలు గ్రహింపగలిగే విషయ పరిజ్ఞానం వున్నాయి.

"వాతావరణపు తీరుతెన్నులు పరిశోధించేందుకు ఐక్యరాజ్య సమితి తరఫున కట్టిన పరిశోధనా కేంద్ర మిది" అన్నాను డెల్లాతో.

"అంతవరకూ నాకూ తెలిసింది! ఇంత ఖర్చుపెట్టి కట్టిన కేంద్రాన్ని ఇలా వదిలేసి ఎందుకు వెళ్ళారు. కనీసం ఒక్క సైంటిస్టుకూడా లే డెందుకు? వాచ్‌మెన్ కూడా లేకపోవడం వింతగా లేదూ!" అడిగింది డెల్లా.

"మిగిలిన బిల్డింగంతా చూద్దాం, పద!" అన్నాను, ఆమె మాటలు పట్టించుకోకుండా.

డెల్లా కదలింది నాతో.

ఇద్దరం రెండుగంటల కాలం మిగిలిన అంతస్తులన్నీ తిరిగాం. ఎన్నో రకాల పరికరాలు, యంత్రాలు,

యాసిడ్‌లు, టెస్ట్ ట్యూబ్‌లు, పుస్తకాలు కనుపించాయి మాకు. పై భాగంలో చదునుగా వున్న టెర్రస్‌పైన ఏవేవో వస్తువులున్నాయి. అక్కడ్నుంచి చూస్తే కను చూపు మేర దాకా నిర్జనమైన అడవి తప్ప మరేం కనుపించలేదు.

అన్ని పరికరాలు పనిచేస్తున్నాయి. సూర్యుడినుండి ప్రసరించే కాంతిలో కరెంటు చేసే యంత్ర మొకటి నా దృష్టిని ఆకర్షించింది. అక్కడ్నుంచి దిగి ఇద్దరం లైబ్రరీ లోకి వచ్చాం.

పుస్తకాలన్నీ తిరగేశాను.

అక్కడి పరిశోధన కేంద్రం గురించి వివరాలు తెలిపే చిన్న పుస్తకం ఒకటి చిక్కింది. దాన్ని చదవసాగాను. మొత్తం ఇరవైనాలుగు పేజీలున్నాయి. ఒక్కొక్క పేజీ చదివేకొద్దీ, గుండెలు దిగజారిపోసాగాయి. నాలో చైతన్యం నశించిపోతూంది. ఉత్సాహం చావడం మొదలెట్టింది.

పుస్తకం పూర్తిజేశాను.

కణతలు పగులుతున్నాయి. నరాలు లోపల్లోపలే పట్ పట్ మని తెగిపోతున్నట్లుగా వుంది నాకు.

"ఏమయింది? ఎందుకలా వున్నావ్?" అడిగింది డెల్లా.

"చావు తప్పించుకొని తీరం చేరామని ఆనందించాం. కానీ మనం చేరింది ఎక్కడికో తెలుసా?" అడిగాను.

"ఎక్కడికో నాకేం తెలుస్తుంది? చెప్తే తప్ప!"

"మరణాల దీవికి చేరుకున్నాం!" అన్నాను అంత కన్నా మరో అందమైన పేరు తెలియక.

“అంటే ఏమిటి? నీ మాటలు నాకర్థం కావడంలేదు!” అంది డెల్లా భయంతో.

“ఈ పుస్తకం చదివాక మనిషి మామూలు పరిస్థితుల్లో నయితే క్షణం బ్రతకడు. నేను మొండివాడ్ని కాబట్టి ఇంకా బ్రతుకున్నాను” అన్నాను.

నా మాటలకు డెల్లా బిత్తరపోయింది. పిచ్చిపట్టినట్లు నాకేసి చూసి “ఏమయింది రాజ్?” అడిగింది.

“సంవత్సరానికోరోజు అంటే ఇరవైనాలుగు గంటల సేపు ఈ దీవిపైన ఏవిధమైన గాలి వుండదు. కొద్దో గొప్పో గాలి వీచిన అందులో మనకు అవసరమైన ఆక్సిజన్ అసలు వుండదట. అలాంటి వాతావరణంలో మనిషి బ్రతకడం అసాధ్యం. అందుకే అన్ని పరిశోధనలకు అవసరమైన పరికరాలు ఇక్కడ అమర్చి సైంటిస్టులు ఈ దీవినుండి వెళ్ళిపోయారు” అన్నాను.

“ఆక్సిజన్ సిలెండర్లు తెచ్చుకోవచ్చుగా?” అడిగింది డెల్లా.

“ఎన్నని తెస్తారు. అలా తెచ్చినా లాభంలేదట. గాలి విషపూరితమై వుంటుందట” చదివింది గుర్తుచేసుకొని చెప్పాను.

“ఎప్పుడు సంభవిస్తుందా పరిస్థితి?”

“ఇరవై ఆరవతేదీ రాత్రి పన్నెండుగంటల నుండి సరిగ్గా ఇరవైనాలుగు గంటల కాలం ఈ దీవిని అంటిపెట్టుకొని వుంటుందా వాతావరణం” అన్నాను.

(సశేషం)